# బీఆర్ఎస్‌కు వెన్నుదన్నుగా



- ఆది నుంచీ గులాబీ పార్టీ వెంటే ఉమ్మడి జిల్లా ప్రజానీకం
- ప్రతి సందర్భంలోనూ మద్దతు • ప్రతి ఎన్నికలోనూ భారీ మెజార్టీ
- 2014, 2018లో గులాబీకే పట్టం • ఈసారి కూడా అదే రిపీట్ అవుతుందంటున్న విశ్లేషకులు • విజయం తమదే అంటున్న బీఆర్ఎస్ అభ్యర్థులు • అయినా అన్నీ పార్టీల్లోనూ టెన్షన్.. టెన్షన్
- పోలింగ్ సరళిపై ఆరా.. గెలుపోటములపై బేరీజు
- నిశ్శబ్ద ఓటుపై తర్జన భర్జన • రేపటి ఉదయం దాకా నిరీక్షణే

కరీంనగర్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఆది నుంచీ బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటున్నది. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి అసెంబ్లీ ఎన్నికల దాకా భారీ మెజార్టీని అందిస్తూ.. కారు వెంటే నడుస్తున్నది. నిజానికి ప్రతి అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ గులాబీ అభ్యర్థులు గెలువరంటూ జోరుగా ప్రచారం సాగినా.. తీరా కౌంటింగ్ అయ్యాక చూస్తే మాత్రం రిజల్ట్ భిన్నంగా ఉంటున్నది. స్వరాష్ట్రంలో జరిగిన 2014, 2018 అసెంబ్లీ ఎన్నికలే అందుకు నిలువెత్తు నిదర్శనం కాగా, వార్ వన్‌సైడ్ అయింది. 2014 ఎన్నికలతో పోలిస్తే 2018 ఎన్నికల నాటికి మూడు శాతం ఓట్లు అధికంగా పెరిగాయి. ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 2014లో 12 స్థానాల్లో ఘన విజయం సాధించగా, అప్పటి ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మొత్తం 9,88,871(48.40 శాతం) ఓట్లు వచ్చాయి. అదే 2018లో 11,41,618 (51.47 శాతం) ఓట్లు వచ్చాయి. 2014తో పోలిస్తే అదనంగా 1,52,747 ఓట్లు పెరిగాయి. 2018 ఎన్నికల్లో మంథని, రామగుండం స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోయారు. నిజానికి ఇక్కడ ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచి ఉంటే ఇంకా ఆ ఎన్నికల్లో ఓట్లు పెరిగి ఉండేవి. 2018 ఎన్నికల్లో రెండు చోట్ల అభ్యర్థులు ఓడిపోయినా ఓటింగ్ శాతం పెరిగింది. అంటే ప్రతి ఎన్నికకూ ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతును పెంచుతున్నట్లుగా కనిపించింది. అంతేకాదు, ఉమ్మడి జిల్లా చరిత్రలో చూస్తే.. అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఒక పార్టీ గతంలో 47 శాతం మించి ఓట్లు వచ్చిన దాఖలాలు లేవు. కానీ, బీఆర్ఎస్ పార్టీ మాత్రం 2018 ఎన్నికల్లో 51.47 శాతం ఓట్లను తన ఖాతాలో వేసుకున్నది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 22,17,710 ఓట్లు పోలు కాగా, అందులో బీఆర్ఎస్‌కు 11,41,618, కాంగ్రెస్-ప్రజా కూటమికి 7,02,803, బీజేపీకి 1,40,708 ఓట్లు వచ్చాయి. అలాగే, 13 నియోజకవర్గాల్లో కలిపి ఇతరులకు 2,32,581 ఓట్లు పడ్డాయి.

## టెన్షన్ టెన్షన్

ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలు తమకు కలిసి వస్తాయని బీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తున్నా.. ఇటు అధికారపక్షం, అటు ప్రతిపక్ష నాయకుల్లోనూ టెన్షన్ టెన్షన్ నెలకొన్నది. ప్రతిపక్ష అభ్యర్థులు తమ శ్రేణుల ద్వారా గెలుపోటములకు సంబంధించి అంచనాలు వేసుకుంటున్నా.. వారిలో నమ్మకం కుదరడం లేదని ఆ పార్టీ శ్రేణులే చెబుతున్నాయి. అందుకు 2014, 2018 ఎన్నికల్లో ఆయా పార్టీలకు వచ్చిన ఓట్లు కూడా ఒక కారణంగా తెలుస్తున్నది. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేశాయి. అప్పుడు ఉమ్మడి జిల్లాలో 2,72,754 ఓట్లు వచ్చాయి. 2018 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా బరిలో నిలిచింది. మెజార్టీ స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయింది. అలాగే, 2018 ఎన్నికల్లో ఆ పార్టీకి 13 అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి 1,40,708 ఓట్లు వచ్చాయి. అంటే 2014 ఎన్నికలతో పోలిస్తే ఏడు శాతం ఓట్లు తగ్గాయి. కాంగ్రెస్ పరిస్థితి అంతంత మాత్రంగానే కనిపించింది. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 51.47 శాతం ఓట్లు వస్తే.. కాంగ్రెస్‌కు అది కూడా అన్ని పార్టీలు కలసి ప్రజాకూటమిగా ఏర్పడితే 31.69 శాతం ఓట్లు వచ్చాయి. ఆనాటి ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రజాకూటమిగా జత కట్టినప్పటికీ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ కంటే 4,38,815 ఓట్లు అధికంగా బీఆర్ఎస్‌కు వచ్చాయి. ఈసారి కూడా అదే ఫలితాలు వస్తాయా..? అన్న టెన్షన్ మాత్రం ప్రతిపక్షాల్లో కనిపిస్తున్నది. దీంతోపాటు ఈసారి ఎన్నికల్లో నిశ్శబ్ద ఓటు బాగా జరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో సదరు ఓటర్ నాడి అంతుచిక్కకుండా ఉన్నది. దీంతో అన్నిపార్టీల అభ్యర్థుల్లోనూ టెన్షన్ టెన్షన్ నెలకొన్నది.

## తమదే విజయమంటున్న బీఆర్ఎస్ అభ్యర్థులు

ఈసారి సైతం తమదే విజయమంటున్నారు బీఆర్ఎస్ అభ్యర్థులు. పైకి పలు రకాలుగా ప్రచారం జరుగుతున్నా.. 2014, 2018 ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయని ధీమాను వ్యక్తం చేస్తున్నారు. 58 ఏండ్ల సమైక్య పాలనలో జరుగని అభివృద్ధి, గడిచిన పదేళ్లలో జరిగిందని, ఇది కండ్ల ముందు ఉందని స్పష్టం చేస్తున్నారు. గతంలో ఏ పాలకులు కూడా రైతుల సంక్షేమాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని, సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగులా చేశారని, అందుకే రైతుల్లో మెజార్టీ ఓట్లు తమకే పడుతాయని ధీమాగా చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గడిచిన పదకొండు విడుతల్లో 9.25 లక్షల మంది రైతులకు సర్కారు రైతుబంధు కింద సుమారు ₹8 వేల కోట్లు అందించిందని, మిషన్‌కాకతీయ కింద 900కు పైగా చెరువులను పునరుద్ధరించి 2.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా చేసిందని, కాంగ్రెస్ హయాంలో మధ్యలో ఆగిపోయిన మధ్యమానేరు ప్రాజెక్టును పూర్తి చేసి వాటర్ హబ్‌గా మార్చిందని, వరద కాలువను రిజర్వాయర్‌గా చేసిందని, కాళేశ్వరం జలాలతో ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసిందని, 24 గంటల కరెంటు ఇస్తున్నదని గుర్తు చేస్తున్నారు. 2014లో కేవలం 3.83 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగైతే.. ఆ విస్తీర్ణం 12.35 లక్షలకు పెరిగిందని, ఆనాడు 13.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే ఇప్పుడు 28.60 లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందని, నాడు వ్యవసాయం దినదిన గండంగా 4.57 లక్షల మంది రైతులు సాగు చేస్తే ఈనాడు ఆ సంఖ్య 9.25,343 మందికి చేరిందని వివరిస్తున్నారు. అనేక పథకాల ఫలితాలు రైతులకు అందాయని, ఆ కారణంగానే అన్నదాతల మెజార్టీ ఓట్లు తమకే పడుతాయన్న నమ్మకం తమకు ఉందని బీఆర్ఎస్ అభ్యర్థులు చెబుతున్నారు. ఇవేకాకుండా సంక్షేమ పథకాలు, విద్యా పథకాలు, మహిళల కోసం అమలు చేస్తున్న స్కీంలు వంటివి కూడా బీఆర్ఎస్‌కు కలిసి వస్తాయని చెప్పడంతోపాటు తమ విజయం తథ్యమని బీఆర్ఎస్ అభ్యర్థులు స్పష్టం చేస్తున్నారు.



| నియోజకవర్గం | టీఆర్ఎస్ | శాతం | కాంగ్రెస్-ప్రజాకూటమి | శాతం | బిజేపీ | శాతం |
|---|---|---|---|---|---|---|
| చొప్పదండి | 91,090 | 54.50 | 48,963 | 29.29 | 15,835 | 9.47 |
| హుస్నాబాద్ | 1,17,083 | 62.67 | 46,553(సీపీఐ) | 24.91 | 4309 | 2.3 |
| హుజూరాబాద్ | 1,04,840 | 59.34 | 61,121 | 34.59 | 1,683 | 09.52 |
| కరీంనగర్ | 80,983 | 40.91 | 39,500 | 19.95 | 66,009 | 33.34 |
| మానకొండూర్ | 88,997 | 51.47 | 57,488 | 33.24 | 4356 | 2.51 |
| జగిత్యాల | 1,04,247 | 65.26 | 43,062 | 26.95 | 4817 | 3.01 |
| కోరుట్ల | 84,605 | 51.59 | 53,385 | 32.55 | 16,046 | 9.78 |
| ధర్మపురి | 70579 | 42.57 | 70138 | 42.31 | 5272 | 3.81 |
| మంథని | 72,185 | 41.35 | 89,045 | 51.01 | 1618 | 0.92 |
| పెద్దపల్లి | 82,765 | 44.77 | 74,299 | 40.19 | 9,375 | 5.07 |
| రామగుండం | 34,981 | 25.89 | 27,181 | 20.12 | 1,553 | 1.14 |
| సిరిసిల్ల | 1,25,213 | 70.88 | 36,204 | 20.49 | 3,243 | 1.83 |
| వేములవాడ | 84,050 | 54.00 | 55,864 | 35.89 | 6,592 | 4.23 |
| మొత్తం | 11,41,618 | 51.47 | 7,02,803 | 31.69 | 1,40,708 | 6.34 శాతం |



## ఇంటి భోజనం.. టీవీ చూస్తూ కాలక్షేపం

సతీమణి స్నేహలతతో కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో టీవీ చూస్తున్న మంత్రి ఈశ్వర్

నిన్నటివరకు తీరికలేకుండా ఓట్ల వేటలో నిమగ్నమైన ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం కరీంనగర్‌లోని తన నివాసంలో కుటుంబసభ్యులతో సరదగా కాలక్షేపం చేశారు. మూడు నెలల తర్వాత సతీమణి స్నేహలత వండిన చికెన్ ఫ్రై, చపాతి, పప్పు, రైస్‌తో భోజనం చేశారు. టీవీ చూస్తూ, హైదరాబాద్‌లో ఉంటున్న తన మనుమడు భవాని నిశ్చల్‌తో కాసేపు ఫోన్లో మాట్లాడారు. - ధర్మపురి,డిసెంబర్ 1



## కుటుంబంతో 'సుంకె' కాలక్షేపం

గంగాధర మండలం బూరుగుపల్లిలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం తన కుటుంబ సభ్యులతో కాలక్షేపం చేస్తూ గడిపారు. తన నివాసానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎన్నికలపై విశ్లేషణ చేశారు. కుటుంబ సభ్యులతో మనస్ఫూర్తిగా మాట్లాడుకోడానికి అవకాశం దొరికిందని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో గులాబీ జెండా మరోసారి ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. - గంగాధర, డిసెంబర్ 1

## ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ..

పోలింగ్ అయిన మరు క్షణం నుంచి చాలా మంది అభ్యర్థులు కాలక్షేపం కోసం కుటుంబసభ్యులతో గడపడమో లేదా విశ్రాంతి తీసుకోవడమో చేస్తుంటారు. కానీ, కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మాత్రం వైద్యసహాయం కోసం వస్తున్న ఎందరో రోగులకు వైద్యసేవలు, సలహాలు అందిస్తూ తన దినచర్యను కొనసాగిస్తున్నారు. పోలింగ్ జరిగిన మరుసటి రోజు నుంచే అలుపూ సొలుపు లేకుండా ఎంతో ఓపికగా యధావిధిగా వైద్యసహాయం చేయడంలో నిమగ్నమడం చూసి కార్యకర్తలు ఒకింత ముగ్ధులైపోతున్నారు. అంతే కాకుండా తన దగ్గరకు వచ్చే నాయకులు, కార్యకర్తలతో పోలింగ్ శాతంపై సమీక్షలు చేస్తూ.. గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పనిచేసిన వారికి ధన్యవాదాలు తెలుపుతున్నారు. - మెట్‌పల్లి, డిసెంబర్1



మెట్‌పల్లి: వైద్యసహాయం కోసం వచ్చిన చిన్నారికి మందులు రాసిస్తున్న డాక్టర్ సంజయ్

- అసెంబ్లీ పోలింగ్ తర్వాత సేదతీరిన అభ్యర్థులు
- తొలిరోజు కుటుంబసభ్యులతో కబుర్లు
- గెలుపోటములపై కార్యకర్తలతో చర్చలు

# 'ఓటు' విడుపు

అసెంబ్లీ ఎన్నికలకు తెరలేచిన మరుసటి రోజు నుంచే అన్ని పార్టీల అభ్యర్థులు కదనరంగంలోకి దిగారు. బీఆర్ఎస్ అభ్యర్థులు మాత్రం మూడు నెలలుగా ప్రజాక్షేత్రంలో గడిపారు. నియోజకవర్గాల్లో ఊరూరా తిరిగి, ఇంటింటికీ వెళ్లారు. ప్రతి రోజూ ఉదయం నుంచి రాత్రి దాకా ప్రచారంలో మునిగితేలారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు విశ్రాంతి లేకుండా చెమటోడ్చారు. సకలజనులను కలుస్తూ, మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. గురువారం పోలింగ్ ముగియడంతో తెల్లారి శుక్రవారం అభ్యర్థులు ఇలా కనిపించారు. కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేస్తూ, కబుర్లు చెబుతూ, టీవీ చూస్తూ, వార్తా పత్రికలు చదువుతూ, చెట్లకు నీళ్లు పడుతూ కొందరు గడపగా, మరికొందరు తమను కలిసేందుకు వచ్చిన కార్యకర్తలతో ముచ్చటించారు. పోలింగ్ జరిగిన తీరుపై చర్చిస్తూ.. గెలుపోటములను బేరీజు వేస్తూ గడిపారు. గెలుపు తమదేనన్న ధీమా వ్యక్తం చేశారు.

- పెద్దపల్లి, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ)



## ఓటింగ్ సరళిపై ఆరాతీస్తూ

నాయకులతో చర్చిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం ఉదయం సతీమణి శాలినితో కలిసి భోజనం చేశారు. తర్వాత నియోజకవర్గ నలుమూలల నుంచి తరలివచ్చిన మద్దతుదారులతో మాట్లాడారు. పోలింగ్ సరళిని తెలుసుకొని విజయం ఖాయమని విశ్వాసం ప్రకటించారు. తనకు ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. - హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 1



మంథని: కార్యకర్తలు, నాయకులతో ముచ్చటిస్తున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

## పోలింగ్ సరళిపై ఆరా తీస్తూ..

మంథని బీఆర్ఎస్ అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ మంథనిలోని రాజగృహలో మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజతో కలిసి నియోజకవర్గంలో అన్ని మండలాలకు సంబంధించిన కార్యకర్తలతో ప్రత్యేకంగా ముచ్చటించారు. పోలింగ్ సరళిపై ఆరా తీశారు. బీఆర్ఎస్ గెలుపు ఖాయమైనట్టేనని ధీమా వ్యక్తం చేశారు. - మంథని, డిసెంబర్ 1



నాయకులు, కార్యకర్తలో మాట్లాడుతున్న జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

## శ్రేణులతో ముచ్చటించి.. ధీమా కల్పిస్తూ

జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ శుక్రవారం పార్టీ శ్రేణులతో ముచ్చటిస్తూ.. గెలుపుపై ధీమా కల్పిస్తూ సరదాగా గడిపారు. ఉదయం గడిచిన పోలింగ్ సరళి, గ్రామ గ్రామాన ఎలా ఉందో తెలుసుకుంటూ కార్యకర్తలు, నాయకులకు గెలుపుపై నమ్మకం కల్పించారు. నియోజకవర్గంలోని జగిత్యాల అర్బన్, రూరల్, సారంగాపూర్, బీర్‌పూర్, రాయికల్ మండలాల నుంచి వచ్చిన నాయకులతో ఉల్లాసంగా ముచ్చటించి, నెల రోజుల నుంచి తన వెన్నంటి ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. - జగిత్యాల, డిసెంబర్ 1



## సమీక్షిస్తూ.. సరదాగా గడుపుతూ..

మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ బెజ్జంకి మండలం గుండారం గ్రామంలోని తన ఫాంహౌస్‌లో నియోజకవర్గ నాయకులతో కలిసి ఎన్నికలపై సమీక్షిస్తూ.. పోలింగ్ సరళిని తెలుసుకుంటూ గడిపారు. పలు మండలాల నాయకులతో కలిసి గ్రామాల వారీగా ఓటింగ్ శాతాన్ని తెలుసుకున్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం కోసం శక్తి వంచన లేకుండా అహర్నిశలు కృషి చేసిన ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. - తిమ్మాపూర్, డిసెంబర్1

బెజ్జంకి మండలం గుండారంలో నియోజకవర్గ నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

## కార్యకర్తలతో కాసేపు..

వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు శుక్రవారం పట్టణంలోని తన ఇంటికి వచ్చిన కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు. ఓటింగ్ సరళిపై ఆరా తీస్తూ గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. - వేములవాడ, డిసెంబర్ 1



## వివాహ వేడుకకు 'వొడితల'

హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ శుక్రవారం వివాహ వేడుకల్లో గడిపారు. రంగారెడ్డి జిల్లా షామీర్‌పేట మండలం కీసర రోడ్డులోని ఓ కన్వెన్షన్‌లో జరిగిన సిద్దిపేట జడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి కూతురు డాక్టర్ ప్రణీతరెడ్డి వివాహానికి ఎమ్మెల్యే తన సతీమణి డాక్టర్ షమితతో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. - హుస్నాబాద్, డిసెంబర్ 1

